# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :216 | ప్రచురణ : హైదరాబాద్ | ఆదివారం,14-06-2026 | పేజీలు: 8 | వెల : 3- 00




## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

- కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్
- జూన్ 30న బాధ్యతల స్వీకరణ
- ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్
- 1986లో సైన్యంలో చేరిన సేథ్
- పలు కీలక కమాండ్లకు నాయకత్వం
- సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర

:భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు.ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో

- మిగతా 2లో



## కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం.. వ్యవహారాన్ని రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు

- మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ
- ఆమెకు సంబంధించిన వివరాలను లీక్ చేసిన తెలంగాణ కాంగ్రెస్ నేత
- అంతర్గత విచారణ ప్రారంభమైందన్న మహేశ్ గౌడ్

- మిగతా 2లో



## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్.. కార్యకర్తలకు దిశానిర్దేశం

- సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి
- ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరతపై విమర్శలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా

- మిగతా 2లో

# పాస్‌పోర్టు సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

- పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు
- కేంద్ర విదేశాంగ శాఖ నుంచి ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక
- 'వెరిఫాస్ట్' యాప్ ద్వారా వేగవంతమైన సేవలకు గుర్తింపు
- జూన్ 19న అవార్డు అందుకోనున్న డీజీపీ సీవీ ఆనంద్



తెలంగాణ పోలీసు శాఖ మరో ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. పాస్‌పోర్ట్ దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను కేంద్ర విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలంగాణ పోలీసులను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డ్ ఫర్ స్టేట్ పోలీస్ (2025-26)'కు ఎంపిక చేసింది.పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా పూర్తి చేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ నెల 19న ఢిల్లీలో నిర్వహించనున్న 'పాస్‌పోర్ట్ సేవా దివస్' వేడుకల్లో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చేతుల మీదుగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.తెలంగాణ పోలీసులు వెరిఫికేషన్ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'వెరిఫాస్ట్' మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలనలో జాప్యాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు, ప్రక్రియ అంతటా పారదర్శకతను పెంచారు. జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ఈ వినూత్న విధానం, పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో తెలంగాణ పోలీసుల అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోంది.



## కాంగ్రెస్‌లో కలకలం.. షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీసులు

- మహిళలు, పార్టీ నాయకత్వంపై షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ప్రచారం
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియో

- మిగతా 2లో



### పశ్చిమాసియాలో శాంతి దిశగా

## కీలక అడుగులు

- 24 గంటల్లోనే అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందం
- డీల్‌పై ఎలక్ట్రానిక్ విధానంలో ఇరువురి సంతకాలు
- పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కీలక ప్రకటన

దాదాపు 3 నెలలకుపైగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా ఎట్టకేలకు దీనికి ఎండ్ కార్డ్ పడేలా కనిపిస్తోంది. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం మరో 24 గంటల్లో ఖరారయ్యే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ తాజాగా ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. అమెరికా ఇరాన్ మధ్య చర్చలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందం ఖరారైన వెంటనే డీల్‌పై ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు జరిగేలా పాకిస్థాన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు షరీఫ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో శనివారం ఓ పోస్ట్ చేశారు. "శాంతి ఒప్పందానికి మేం ఎప్పుడూ ఇంత దగ్గరగా రాలేదు. మరో 24 గంటల్లోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది. తర్వాత

మిగతా 2లో..

### ఎప్పటికీ అణ్వాయుధాలు తయారు చేయం

- అణ్వాయుధాలపై అమెరికాకు ఇరాన్ హామీ!!
- అమెరికా దాడిలోనే భారతీయులు మృతి
- నిబంధనలు పాటిస్తేనే ఒప్పందంపై సంతకం
- ట్రంప్ ఆరోపణలను ఖండించిన ఇరాన్

అమెరికా-ఇరాన్ మధ్య చర్చల్లో కీలక పురోగతి

మిగతా 2లో..

### తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

- సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్
- టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో చేరిక
- యూటర్న్ తీసుకున్న మరో ఎంపి కళ్యాణ్ బెనర్జీ
- అభిషేక్ బెనర్జీ తన కొడుకు లాంటి వాడంటూ కితాబు

తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో తలెత్తిన సంక్షోభం కొనసాగుతోంది. మరోవైపు అంతర్గత వ్యవహారాలు క్షణక్షణానికి మారుతూ ఉత్కంఠ రేపుతున్నాయి. పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి తాజాగా ఆ పార్టీ సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్ ఇచ్చారు. టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో శనివారంనాడు చేరారు. అనంతరం మరో అసమ్మతి ఎంపీ శతాబ్ది రాయ్‌తో కలిసి కేంద్ర

మిగతా 2లో..



### హైదరాబాద్‌లో

# భారీ వర్షం

- పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం
- అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్
- అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం



హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా

మిగతా 2లో..

## తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ సింగరేణి

- కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- డిపెండెంట్ కార్మికులకు నియామక పత్రాలు



మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల పక్రియను వేగవంతం చేసి,

మిగతా 2లో..

### పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో

మిగతా 2లో..

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్.. కార్యకర్తలకు దిశానిర్దేశం

- మొదటి పేజీ తరువాయి

అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు.
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రొజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌లో కలకలం.. షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీసులు

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హైకమాండ్ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా, అలాగే పార్టీ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.వైరల్ అయిన ఆడియోలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై కూడా షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొట్టడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడమే కాకుండా, అంతర్గత వ్యవహారాలను బహిరంగ చర్చకు తీసుకురావడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

## కోవర్టుల సంగతి తేలుస్తాం.. వ్యవహారాన్ని రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు: మహేశ్ గౌడ్

మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు.
కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్టులను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. "లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది" అని అన్నారు.
నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

## తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ సింగరేణి

మొదటిపేజీ తరువాయి..

బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు వితల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

మొదటిపేజీ తరువాయి..

మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. 19 మంది ఎంపీలతో కలిసి తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సోమవారంనాడు కలుసుకోనున్నట్టు రెబల్స్ గ్రూప్ ప్రకటించిన నేపథ్యంలో సుదీప్ బందోపాధ్యాయ్ ఆ గ్రూపులో కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8 నుంచి టీఎంసీ అసమ్మతి ఎంపీల సంతకాల సేకరణ చేపట్టామని, 19 ఎంపీలు సంతకాలు చేశారని రెబల్ ఎంపీ చంద్ర బర్మ బసునియా వెల్లడించారు. ఇప్పటికే ఒకసారి స్పీకర్‌ను కలిసిన తాము ఈనెల 15న మరోసారి కలిసి తమ గ్రూపునే నిజమైన టీఎంసీగా గుర్తించాలని కోరనున్నట్టు చెప్పారు. ఓంబిర్లాను కలవడానికి ముందు టీఎంసీ రెబల్స్ న్యూఢిల్లీలో సమావేశం అవుతారని, అందులో పాల్గొనేందుకు 20 మంది ఎంపీలు న్యూఢిల్లీ చేరుకుంటారని అసమ్మతి వర్గ నేత ఒకరు చెప్పారు. కాగా, తిరుగుబాటు వర్గం వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వారి వాదనకు ఎలాంటి చట్టబద్ధత లేదని పార్టీ ఎంపీ మహువా మొయిత్ర తెలిపారు. పార్టీలో చీలిక ప్రొవిజన్‌ను రాజ్యాంగంలోని 91వ సవరణ తొలగించినట్టు చెప్పారు. 19 మంది 'ద్రోహులు' పార్టీకి రాజీనామా చేసి, బీజేపీ టిక్కెట్‌పై పోటీ చేయాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మహువా మొయిత్ర పేర్కొన్నారు. 'ఆపరేషన్ లోటస్' పేరుతో ఫిరాయింపులకు బీజేపీ వ్యూహరచన చేసిందని, పార్టీని చీల్చాలనే ప్రయత్నం ఏమాత్రం సఫలం కాదని టీఎంసీ మరో ఎంపీ కీర్తి ఆజాద్ అన్నారు. ఇదిలావుంటే టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎవరికీ గౌరవం ఇవ్వడం లేదని, ఆయన కావాలో, తాను కావాలో తేల్చుకోండంటూ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అల్టిమేటం ఇచ్చిన ఆ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు యూటర్న్ తీసుకున్నారు. 'అభిషేక్ నా కొడుకుతో సమానం. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుంది' అని అన్నారు. సంతకాల ఫోర్జరీ కేసులో అభిషేక్ తరఫున కల్యాణ్ బెనర్జీ వాదిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు నుంచి అభిషేక్ బెనర్జీకి హైకోర్టు తాత్కాలిక రక్షణ ఇచ్చింది. అయితే ఈ కేసులో కల్యాణ్ బెనర్జీ స్థానంలో మరొక లాయర్ వచ్చి చేరడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. అభిషేక్ అహంకారిగా మారిపోయాడని, ఎవరినీ గౌరవించడం లేదని, అభిషేక్ లేకుండా పార్టీ నడవదని మమతా బెనర్జీ భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకుంటానని ఆయన హెచ్చరించారు. దీనిపై అభిషేక్ ఆచితూచి స్పందించారు. కల్యాణ్ బెనర్జీ తనకంటే పెద్దవారని, ఆయన తన అభిప్రాయాలను చెప్పడంలో తప్పులేదని, చిన్నప్పటి నుంచి తనను ఆయన చూశారని, ఆయన గురించి తాను ఏమీ మాట్లాడలేనని అన్నారు. ఈ క్రమంలో అభిషేక్ తన కుమారుడి లాంటివాడని కల్యాణ్ బెనర్జీ ప్రకటించడంతో టీఎంసీ అధినాయకత్వం ఊపిరి పీల్చుకుంది. కాగా,



కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందంటూ కొందరు చేస్తున్న ఊహాగానాలను కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు తోసిపుచ్చారు. కాంగ్రెస్‌లో టీఎంసీ కలవబోవడం లేదని చెప్పారు. రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కలుస్తారంటూ వస్తున్న వార్తలపై సూచిగా స్పందించారు. 'వాళ్లు ఏమి చేయాలనుకుంటే అది చేయవచ్చు. బీజేపీ గొడుకు కింద పనిచేయాలనుకుంటున్నారు. ఇదంతా ఓ కుట్ర. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీతో పనిచేయాలనుకుంటున్నట్టు చెబుతున్నారు. తమ నియోజకవర్గాలకు ఒక్కసారి కూడా వెళ్లని వాళ్లు ప్రజలకు చేసేదేముంటుంది? బెంగాల్‌లో ప్రజాస్వామ్యం పీకనొక్కేసారు. గత నెలరోజుల్లో ఎలాంటి అభివృద్ధి చేశారు? మమ్మల్ని బీజేపీ వేధిస్తోంది, పోలీసులు వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఏ విపక్షానికి రాలేదు. 19 మంది ఎంపీలు వెళ్లిపోవాలనుకున్నా వాళ్లను బీజేపీ చేర్చుకోదఅని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

## పశ్చిమాసియాలో శాంతి దిశగా కీలక అడుగులు



మొదటిపేజీ తరువాయి..

ఎలక్ట్రానిక్ సంతకాలు, వచ్చే వారమే సాంకేతిక స్థాయి చర్చలు జరుగుతాయి" అని పాకిస్థాన్ పీఎం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చర్చల సమయంలో ఎంతో సహకరించిన అమెరికా- ఇరాన్ ప్రభుత్వాలకు షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. మద్దతు ఇచ్చిన పశ్చిమాసియాలోని ఇతర దేశాలకు



కూడా ధన్యవాదాలు చెప్పారు. దీర్ఘకాలిక శాంతి దిశగా ఈ చారిత్రక ఒప్పందం బలమైన పునాది వేస్తుందని విశ్వసిస్తున్నట్లు వెల్లడించారు. షరీఫ్ ప్రకటనకు ఒకరోజు ముందుగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకూడా ఈ ఒప్పందం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇస్లామాబాద్ అవగాహనా ఒప్పందం ఇంతకుముందెన్నడూ లేనంత దగ్గరలో ఉంది. తుది ఒప్పందం పూర్తయ్యే వరకు మీడియా ఊహాగానాలన్నింటికీ దూరంగా ఉండాలి' అని చెప్పారు. అరాగ్చీ పోస్టును యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయడం విశేషం.అయితే ఇక్కడ ఒప్పందం తుది దశకు చేరుకుంటుందన్న తరుణంలోనే ఇరాన్‌పై ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఇరాన్ మీడియా కథనాల్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇరాన్ మీడియా ప్రకటనలకు, చర్చల్లో అంగీకరించిన అంశాలకు సంబంధం లేదని వ్యాఖ్యానించారు. ఒప్పందం విషయంలో ఇరాన్ ఏ మాత్రం నిజాయతీగా వ్యవహరించడం లేదన్నారు. వారితో వ్యవహరించడం చాలా కష్టం అని, వెంటనే తమ వైఖరి మార్చుకోవాల్సిన అవసరం ఉందని ట్రంప్ హెచ్చరించారు. ఒప్పందంలోని విషయాల్ని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ వెల్లడించారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఎత్తి వేయడం సహా హర్మూజ్ జలసంధి నిర్వహణలో పలు కీలక మార్పులు వంటివి ప్రతిపాదిత ఒప్పందంలో ఉన్నట్లు తెలిపారు. ఇదే సమయంలో ఇరాన్ వద్ద ఉన్నటువంటి యురేనియం అంశాన్ని కూడా చర్చల్లో పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక అవగాహనా ఒప్పందంలో కొన్ని నిబంధనలపై వారాలుగా నిలిచిపోయిన చర్చల అనంతరం ఇటీవల ఇరాన్, అమెరికా తాము ఒప్పందానికి చేరువవుతున్నట్లు సంకేతాలు ఇచ్చాయి. కానీ అన్ని అంశాలపై పూర్తి స్థాయిలో ఇరు వర్గాల అంగీకారం కుదిరే వరకు ఒప్పందం ఖరారైందని చెప్పలేమని ఇరాన్ స్పష్టం చేసింది. ఇటు ఒప్పందానికి చేరువైనట్లు ప్రకటనలు వస్తుండగా మరోవైపు హర్మూజ్ జలసంధిలో శనివారం వాణిజ్య నౌకల్ని లక్ష్యంగా చేసుకున్న పలు ఇరాన్ డ్రోన్లను అమెరికా కూల్చివేసినట్లుగా ప్రకటించడం ఆందోళనలు రేకెత్తిస్తోంది.

## ఎప్పటికీ అణ్వాయుధాలు తయారు చేయం

మొదటిపేజీ తరువాయి..

సాధించినట్లు ట్రంప్ ప్రభుత్వానికి చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం అణ్వాయుధాలను ఎప్పటికీ అభివృద్ధి, కొనుగోలు చేయకూడదని ఇరాన్ అంగీకరించిందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత ప్రాధాన్యంగా భావించిన అంశాల్లో ఇదొకటని పేర్కొన్నారు. ఈ హామీ కేవలం మాటలకే పరిమితం కాకుండా, కఠిన తనిఖీలు, నిరంతర పర్యవేక్షణ, ధ్రువీకరణ వ్యవస్థలతో అమలవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ తన బాధ్యతలను నిజంగా నిర్వర్తిస్తోందని నిర్ధరణ అయిన తర్వాత మాత్రమే ఒప్పందం కింద ప్రయోజనాలు అందుతాయని వివరించారు. ప్రతిపాదిత ఒప్పందంలో భాగంగా బాగా శుద్ధి చేసిన అణు పదార్థాలను పూర్తిగా తొలగించేందుకు ఇరాన్ అంగీకరించినట్లు అమెరికా అధికారి తెలిపారు. అలాగే అణ్వాయుధాల తయారీకి దోహదపడే అణు కేంద్రాలను నిర్వీర్యం చేసే అంశంపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అయితే ఈ ప్రక్రియకు సంబంధించిన సాంకేతిక అంశాలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. అయినప్పటికీ, ఇరాన్ భవిష్యత్తులో అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా నిరోధించే దిశగా ఇది అత్యంత కీలకమైన తొలి అడుగుగా అభివర్ణించారు.ఒప్పందాన్ని అత్యంత జాగ్రత్తగా రూపొందించామని అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ తన వాగ్దానాలను నెరవేర్చకుండానే ఎలాంటి ప్రయోజనాలు పొందకుండా వ్యవస్థను రూపొందించామని పేర్కొన్నారు. అమెరికా ప్రయోజనాలు, భద్రతా లక్ష్యాలు నెరవేరిన తర్వాత మాత్రమే ఇరాన్‌కు ఆర్థిక రాయితీలు, ఆంక్షల సడలింపులు అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఇరాన్ తన బాధ్యతలను అమలు చేసిన మేరకే ప్రయోజనాలు పొందేలా ఒప్పందం నిర్మాణం ఉందన్నారు. మరోవైపు హర్మూజ్ జలసంధిలో భారతీయ వాణిజ్య నౌకపై దాడి విషయమై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇండియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం తీవ్రంగా ఖండించింది. ట్రంప్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవి మాత్రమే కాదని, అమెరికా దళాలు చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఆడుతున్న నాటకంగా అభివర్ణించింది. భారతీయ నావికులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకపై అమెరికా సైన్యమే దాడులు చేసిందని ఎంబసీ పేర్కొంది. ఈ దాడుల నుంచి ప్రపంచ దేశాల దృష్టిని మళ్లించడానికే వాషింగ్టన్ ఇరాన్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఇరాన్ రాయబార కార్యాలయం పేర్కొంది. భారత్‌లోని ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ రాయబార కార్యాలయం శనివారం అధికారికంగా ఒక సుదీర్ఘ ప్రకటనను విడుదల చేసింది. గడిచిన వారం రోజులుగా అమెరికా దళాలు అంతర్జాతీయ సముద్ర చట్టాలను తుంగలో తొక్కి మూడు భారతీయ నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించాయని ఇరాన్ వెల్లడించింది. ఈ దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించారని, ఇందుకు అమెరికా పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. అమెరికా చర్యలు అత్యంత క్రూరమైనవిగా ఇరాన్ అభివర్ణించింది. అలాగే, అమెరికా- ఇరాన్ దేశాల మధ్య కుదరబోయే ప్రాథమిక అవగాహన ఒప్పందంపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఈ ఒప్పందంలో అణు కార్యక్రమం, ఇరాన్‌పై ఆంక్షల తొలగింపు, హర్మూజ్ జలసంధి హోదాతో సహా పలు కీలక అంశాలు ఉంటాయని చెప్పారు. ఈ ఒప్పందం రెండు దశల్లో ఉంటుందని, మొదటి దశలో అణు అంశాలపై ఎటువంటి చర్చలు జరగలేదని, వాటిని రెండో దశకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ అవగాహన ఒప్పందంలోని నిబంధనలను నెరవేర్చకపోతే, తుది ఒప్పందంపై సంతకాలు చేయబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ ఒప్పందంలో మొదటగా ప్రస్తావించిన అంశం ఏమిటంటే అమెరికా విధిస్తున్న నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయడం అని అరాగ్చీ స్పష్టం చేశారు. అలాగే, హర్మూజ్ గుండా వెళ్లే నౌకల నుంచి టోల్ వసూలుపై కూడా అరాగ్చీ స్పందించారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే నౌకల నుంచి టోల్ వసూలు చేయడం సాధ్యం కాదని, కానీ సేవా రుసుములను వసూలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఇరాన్‌కు నష్టపరిహారం చెల్లించే ప్రణాళిక కూడా ఒప్పందంలో ఉందన్నారు. హర్మూజ్ జలసంధి భవిష్యత్తు గతంలోలా ఉండబోదన్నారు. దీని నిర్వహణపై ఇరాన్, ఒమన్ దేశాలు త్వరలోనే ఒక ఉమ్మడి ప్రకటనను విడుదల చేస్తాయని ఆయన సూచించారు. అమెరికా దాడులపై ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ స్పందించారు.

## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

మొదటిపేజీ తరువాయి..

శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు.





16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.

## తదుపరి ఆర్మీచీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్

మొదటిపేజీ తరువాయి..

పదవీకాలం 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్ 1986లో భారత సైన్యంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో పని చేశారు. ధీరజ్ సేథ్ దక్షిణ



కమాండ్, దక్షిణ పశ్చిమ కమాండ్‌లకు సారథ్యం వహించడంతో పాటు, ఆర్మీ ప్రధాన కార్యాలయంలోనూ కీలక పదవులు చేపట్టారు. సైన్యంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు పరమ్ విశిష్ట సేవా మెడల్ , ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.

## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

మొదటిపేజీ తరువాయి..

పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.






## హైదరాబాద్‌లో భారీ వర్షం

మొదటిపేజీ తరువాయి..

రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

- మొదటి పేజీ తరువాయి

ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు.సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

# యూరియా యాప్ వినియోగంపై అవగాహన. జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర



**న్యూస్ ఇండియా తెలుగు జూన్ 13. మహబూబాబాద్ జిల్లా బయ్యారం....** జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయ చంద్ర,మండల వ్యవసాయ అధికారి కే.రాజుతో కలిసి బయ్యారం మండలంలోని కొత్తపేట నుండి మిర్యాలపెంట వరకు ఏజెన్సీ గ్రామాలను సందర్శించి,రైతులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో యూరియా యాప్ పనితీరును పరిశీలించి,రైతులకు యాప్ ద్వారా యూరియా బుకింగ్ విధానం,దాని ప్రయోజనాలు,పారదర్శకత గురించి రైతులకు వివరించారు.అల్లిగూడెం,పందిపంపుల గ్రామాలలో రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి యూరియా యాప్ వినియోగంపై విస్తృత అవగాహన కల్పించారు.యాప్ ద్వారా రైతులు సులభంగా యూరియా బుకింగ్ చేసుకోవచ్చని,ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా జరుగుతుందని వివరించారు.

అనంతరం అల్లిగూడెం గ్రామ సర్పంచ్ చింత ప్రసాద్ తో సమావేశమై గ్రామంలోని వ్యవసాయ పరిస్థితులను తెలుసుకున్నారు.పంటల వైవిధ్యీకరణలో భాగంగా రానున్న వానాకాలంలో మొక్కజొన్న సాగు నుండి ఆయిల్ పామ్ సాగుకు మారేందుకు ముందుకు వచ్చిన రైతులు అవిరె నారాయణ, మురళీకృష్ణ తదితరులను జిల్లా వ్యవసాయ అధికారి ప్రత్యేకంగా అభినందించారు.ఇతర రైతులు కూడా అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి పంట అవశేషాల దహనం వల్ల నేల సారం తగ్గిపోవడం, పర్యావరణ కాలుష్యం పెరగడం, భూసార జీవులు నశించడం వంటి దుష్పరిణామాలను రైతులకు వివరించారు.అదేవిధంగా పంటల వైవిధ్యీకరణ అవసరాన్ని నొక్కి చెబుతూ,నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,లైసెన్స్ పొందిన విత్తన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.యూరియా ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, సమీకృత పోషక నిర్వహణ పద్ధతులను అవలంబించాలని, నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించడం ద్వారా ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

# ఎరువుల ధరలను పెంచి వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్న మోడీ ప్రభుత్వం----బిగౌని ఐలయ్య




**న్యూస్ ఇండియా తెలుగు జూన్ 13 మహబూబాబాద్ జిల్లా బయ్యారం......**ఎరువులపై ఇప్పటి వరకు ఇస్తున్న సబ్సిడీని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవటం వలన వాటి ధరలు భారీగా పెరిగాయని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. పంటలకు మద్దతు ధర లభించక, పంటలను కొనే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతాంగంపై ఎరువుల ధరలు పెరుగుదల పెను భారంగా మారనున్నదని ఆయన అన్నారు.ఎరువుల ధరల పెరుగుదలకు నిరసనగా ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఈరోజు బయ్యారం బస్టాండ్ సెంటర్లో జరిగిన ధర్నా నుద్దేశించి ఆయన ప్రసంగించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతుల పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఆచరణలో వారికి మొండి చేయి చూపించిందని మాటల్లో రైతు జపం చేస్తూ ఆచరణలో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే చర్యలకు పూనుకున్నదని ఆయన విమర్శించారు. వ్యవసాయ దిగుమతులపై సుంకాలు తగ్గించడంతో మన దేశంలోకి వ్యవసాయ ఉత్పత్తులు భారీ ఎత్తున దిగుమతి అవుతున్నాయని, తద్వారా అర కొరగా ఇస్తున్న మద్దతు ధరలకు కూడా రైతు పండించిన పంటను కొనే నాథుడు కరువయ్యాడని, మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు రైతులు తమ పంటలను ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారని ఆయన అన్నారు. ఇప్పటికే దేశంలో ప్రతి 30 నిమిషాలకు రైతు అప్పుల బారినబడి ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఇప్పుడు ఎరువుల భారం పెరగడంతో రైతుల తలపై పిడుగు పడినట్లు అయిందని ఆయన అన్నారు. ఎరువులకు ఇచ్చే సబ్సిడీలను కొనసాగించాలని, పెంచిన ఎరువుల ధరలను తగ్గించి కొరత లేకుండా అవసరమైనన్ని ఎరువులను రైతాంగానికి సరఫరా చేయాలని ఐలయ్య డిమాండ్ చేశారు. ధర్నాకు ముందు గడ్డం వెంకట్రామయ్య విజ్ఞాన కేంద్రం నుండి బయ్యారం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో

ఏఐకేఎంఎస్, ఇతర ప్రజాసంఘాల నాయకులు తోకల వెంకన్న,మోకాళ్ళ మురళీకృష్ణ,మైల యాకన్న,తుడుం వీరభద్రం, నేతకాని రాకేష్,రామగిరి బిక్షం,బానోత్ నర్సింహా,మెంగు భగవాన్,ధారావత్ మంగీలాల్,పూనెం లింగన్న,గంగారపు బిక్షం, నూతక్కి భూషణ్ రావు,వీరబోయిన ఐలయ్య,సజ్జ జలేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీకే సమస్యలపై ఎమ్మెల్యే వివేకానంద, మాజీ కార్పొరేటర్ జగన్ పర్యటన.....

త్రాగునీరు, డ్రైనేజీ, చిరు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం.



**కుత్బుల్లాపూర్, జూన్ 13 (న్యూస్ ఇండియా ప్రతినిధి)** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) సదాయంలో నెలకొన్న పలు సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, స్థానిక మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శనివారం కాలనీలో పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ధర్మారపు అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, కాలనీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కాలనీ వాసులు ప్రధానంగా త్రాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, అలాగే జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల షాపుల తొలగింపు, సంక్షేమ సంఘం భవన నిర్మాణం,రోడ్లు తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. త్రాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి కాలనీ ప్రజలకు ఉపశమనం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. చిరు వ్యాపారుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే, ఉపాధి కోసం చిన్న చిన్న షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వారి జీవనోపాధి దెబ్బతినకుండా పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ త్రాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని, అలాగే చిరు వ్యాపారుల సమస్యను సానుకూలంగా పరిశీలించి వారికి ఇబ్బందులు కలగకుండా చూడటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతీ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి




- ఎంపిడిఓ డాక్టర్ లెక్కల అరుంధతి
- ఎంపీఓ శ్రీధర్ గౌడ్ తో పాటు కార్యాలయ సిబ్బంది 13 మంది పంచాయతీ కార్యదర్శులకు వీడ్కోలు

**న్యూస్ ఇండియా: నర్సంపేట:**ప్రభుత్వంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతీ ఉద్యోగికి బదిలీ అనేది తప్పనిసరి అని దుగ్గొండి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపిడిఓ డాక్టర్ లెక్కల అరుంధతి అన్నారు.దుగ్గొండి మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించిన మండల పంచాయతీ అధికారి మోడెం శ్రీధర్ గౌడ్ నెక్కొండకు బదిలీపై వెళ్లగా,జూనియర్ అసిస్టెంట్ శత్రజ్ఞ రెడ్డి గీసుకొండ సీనియర్ అసిస్టెంట్ గా ప్రమోషన్ గా వెళ్ళారు.అలాగే సీనియర్ అసిస్టెంట్ ,టైపిస్ట్,ఇద్దరు అరెండర్స్,13 మంది పంచాయతీ కార్యదర్శులు వివిధ ప్రాంతాలకు బదిలీలపై వెళ్ళగా ఎంపీఓ, సీనియర్,జూనియర్ అసిస్టెంట్లు,సిబ్బంది 14 మంది పంచాయతీ కార్యదర్శులు కొలువుతీరారు.ఈ నేపథ్యంలో దుగ్గొండి నుండి ప్రమోషన్,బదిలీలపై వెళ్ళిన,దుగ్గొండి మండలానికి నూతనంగా వచ్చిన అధికారులు,సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం మండలంలోని గిర్నిబావిలో వీడ్కోలు,స్వాగతం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డాక్టర్ లెక్కల అరుంధతి మాట్లాడుతూ కొన్ని మండలంలో విధులు నిర్వర్తించిన విధంగానే నిజాయితీగా పనిచేయాలని సూచించారు.గతంలో అభివృద్ధి పట్ల అధికారులు,కార్యదర్శులు పని చేసారు.నిబంధనల ప్రకారంగా నిధులు నిర్వర్తించుకోవాలి. ప్రజలకు సేవలు అందించడంతోపాటు జవాబుదారితనంగా వ్యవహరించాలని నూతనంగా కొలువుదీరిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నెక్కొండ మండలానికి బదిలీపై వెళ్లిన ఎంపీఓ శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ

అందరి సహకారంతో విధులు నిర్వహించిన. నూతనంగా విధులు నిర్వహించే అధికారులకు కూడా సహకరించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహదపడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం మండలానికి వచ్చిన అధికారులు పంచాయతీ కార్యదర్శులకు శాలువాలతో సన్మానం పలికి బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరి ప్రసాద్, కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు కొండల్ రెడ్డి,వేణు,సంతోష్,పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, రాజేంద్రప్రసాద్, రమేష్, దేవేందర్, రాజేష్,అశోక్ రెడ్డి పలువురు అధికారులకు కార్యదర్శిలు పాల్గొన్నారు.

# అక్రమ అబార్షన్ ముఠాపై పోలీసుల ఉక్కుపాదం..




డెకాయ్ ఆపరేషన్‌లో బట్టబయలు.. ఇద్దరి అరెస్టు.. కోర్టుకు తరలింపు..

**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, జూన్ 13, న్యూస్ ఇండియా ప్రతినిధి:** మహిళల ప్రాణాలతో చెలగాటమాడుతూ, చట్టాలను తుంగలో తొక్కి అక్రమంగా గర్భస్రావాలు నిర్వహిస్తున్న ఓ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై నాగోల్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎలాంటి వైద్య అర్హతలు, ప్రభుత్వ అనుమతులు లేకుండానే గర్భిణీలకు అబార్షన్లు నిర్వహిస్తున్న దందా డెకాయ్ ఆపరేషన్‌లో బట్టబయలైంది. ఈ వ్యవహారంలో ఇద్దరిని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మక్బుల్ జానీ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైపురి కాలనీ రోడ్ నెంబర్-2లో "కేసరి ఫస్ట్ ఎయిడ్ సెంటర్" పేరుతో నిర్వహిస్తున్న కేంద్రంలో అక్రమంగా గర్భస్రావాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎస్‌వోటీ ఎల్బీనగర్ బృందం, నాగోల్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. ఆపరేషన్‌లో భాగంగా గర్భిణీ మహిళగా మహిళా కానిస్టేబుల్‌ను కేంద్రానికి పంపగా, అక్కడ ఉన్న వీర రేవతి (50) ఎలాంటి వైద్య అర్హతలు లేకుండానే అబార్షన్ చేయడానికి అంగీకరించింది. అంతేకాకుండా గర్భిణీలను తనకు పరిచయమున్న స్కానింగ్ కేంద్రాలకు పంపించి, నివేదికల ఆధారంగా గర్భస్రావాలు నిర్వహిస్తున్నట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. మహిళా కానిస్టేబుల్ నుంచి రూ.10 వేల నగదు తీసుకున్న అనంతరం ప్రాథమిక పరీక్షలు నిర్వహించి గర్భస్రావానికి సిద్ధమవుతుండగా, ముందస్తు ప్రణాళిక ప్రకారం అక్కడే ఉన్న పోలీసులు దాడి చేసి మొత్తం వ్యవహారాన్ని బట్టబయలు చేశారు. దాడిలో భాగంగా భారీ మొత్తంలో మందులు, వైద్య పరికరాలు, రికార్డులు, ఇతర కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వైద్య సేవలు అందించడం, అక్రమ గర్భస్రావాలు నిర్వహించడం, మహిళల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం, వైద్య నిబంధనలను ఉల్లంఘించడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో కేంద్ర నిర్వాహకురాలు బండారు వెంకట లక్ష్మితో పాటు వీర రేవతిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ అక్రమ వ్యవహారానికి మరెవరైనా సహకరించారా? స్కానింగ్ కేంద్రాలతో ఉన్న సంబంధాలు ఏమిటి? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేసే ఇలాంటి నకిలీ వైద్య కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు పొందిన ఆసుపత్రులు, అర్హత కలిగిన వైద్యులను మాత్రమే ఆశ్రయించాలని సూచించారు. ఈ ఘటనతో నగరంలో అక్రమ వైద్య కేంద్రాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# ఎకో టౌన్ (డంపింగ్ యార్డుకు) వ్యతిరేకంగా పోరాటం: మంచిరెడ్డి కిషన్ రెడ్డి మద్దతూ..

- బండరావిరాల గ్రామస్తుల ఆందోళన.. స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాము..



**రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్, జూన్ 13, న్యూస్ ఇండియా ప్రతినిధి:**

అబ్దుల్లాపూర్మెట్ మండలం బండరావిరాల గ్రామ సర్వే నంబర్ 268 లో 494 ఎకరాలలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే ఎకో టౌన్ (డంపింగ్ యార్డుకు) వ్యతిరేకంగా స్థానిక ప్రజలు తమ నిరసనను ఉధృతం చేశారు. ఈ నేపథ్యంలో, డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతూ బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామస్తుల వినతిపై మాజీ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలు చేస్తున్న న్యాయపరమైన పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ విషయమై అధికారులు తక్షణమే స్పందించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, ప్రజలతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ విషయంపై ఆయన అనుసరిస్తున్న వైఖరి సరైనది కాదంటూ మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజల ఆరోగ్యంతో ఆడుకునేలా నివాస ప్రాంతాల వద్ద డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు నేమురగోముల మహేష్, కన్నె భరత్ యాదవ్, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, గుండ్ల భవాని శివ ముదిరాజ్, గ్రామ యువ నాయకులు కవాడి దయాకర్ రెడ్డి, గుండ్ల సతీష్ యాదవ్, కొత్త శ్రీకాంత్ గౌడ్, ఒంగూరి రమేష్, గుండ్ల శ్రీకాంత్,గుండ్ల మల్లేష్, కవాడి ఉదయ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీ పై వెళ్లిన పంచాయతీ కార్యదర్శుల కు వీడ్కోలు సన్మానం

నూతన కార్యదర్శులకు స్వాగత సన్మానం



**న్యూస్ ఇండియా:నర్సంపేట** :ఘనంగా పంచాయతీ కార్యదర్శుల వీడ్కోలు సన్మాన సభ ,
ఇటీవల బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులకు వీడ్కోలు సన్మానం నూతన కార్యదర్శులకు స్వాగత సన్మాన కార్యక్రమం శుక్రవారం రోజు గిర్నిబావి జిబిఆర్ ఫంక్షన్ హాల్ వద్ద అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో లెక్కల అరుంధతి హాజరై పంచాయతీ కార్యదర్శుల
సేవలను కొనియాడుతూ,
ఈ సందర్భంగా ఎంపీడీవో అరుంధతి మాట్లాడుతూ... కార్యదర్శులు తమ పదవీ కాలంలో గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.ప్రజలతో ఎంతో స్నేహపూర్వకంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించారని గుర్తుచేసుకున్నారు.

**ఘన సన్మానం:**

అనంతరం బదిలీపై వెళ్తున్న ప్రతి ఒక్క కార్యదర్శి కి శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.
భావోద్వేగానికి గురైన కార్యదర్శి
సన్మానం అనంతరం కార్యదర్శి మాట్లాడుతూ... దుగ్గొండి మండలంలోని రేకంపల్లి గ్రామంలో పనిచేయడం తనకు ఎంతో తృప్తిని ఇచ్చిందని, ఐదు సంవత్సరాల నాలుగు నెలలు సుదీర్ఘకాలం పనిచేశానని తన విధులకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, పంచాయతీ సిబ్బందికి గ్రామ ప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.ఇక్కడి ప్రజలు చూపిన ఆదరాభిమానాలను ఎప్పటికీ మరచిపోలేనని భావోద్వేగానికి గురయ్యారు.?ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు గ్రామ ప్రజలు పాల్గొని కార్యదర్శి కి శుభాకాంక్షలు తెలిపారు.
గ్రామ పంచాయతీ కార్యదర్శిగా మీరు అందించిన సేవలు అనన్యసామాన్యం.విధి నిర్వహణలో మీరు చూపిన అంకితభావం,క్రమశిక్షణ, గ్రామాభివృద్ధిపై మీకున్న తపన మారుమూల గ్రామాన్ని సైతం ప్రగతి పథంలో నడిపించాయి.
ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తూ,ప్రజల మన్ననలు పొంది, అందరి గుండెల్లో ఒక మంచి అధికారిగా స్థానం సంపాదించుకున్నారు.మీతో కలిసి పనిచేయడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాము.
బదిలీపై వెళ్తున్న మీకు మా గ్రామ ప్రజల తరపున, ప్రజాప్రతినిధుల తరపున హృదయపూర్వక వీడ్కోలు పలుకుతూ... మీరు వెళ్లే నూతన ప్రాంతంలో కూడా ఇలాగే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

# వ్యాధుల నియంత్రణకు ముందడుగు

కుసంగి గ్రామంలోని బైపాస్ రోడ్డు లో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలను తొలగించిన గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గం




**న్యూస్ ఇండియా (టేక్మాల్ రిపోర్టర్ జైపాల్ జూన్ 13)** మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామంలో ప్రయాణీకులకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే సంకల్పంతో గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్ మరియు పాలకవర్గ సభ్యులు,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలోని బైపాస్ రోడ్డు, స్థానిక స్కూల్ ప్రహరీ గోడ ప్రక్కన, దాదాయిపల్లి రోడ్డు, చింతకుంట రూట్, రోడ్డుకు ఇరువైపుల గల ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలను తొలిగించి రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. అనంతరం బైపాస్ రోడ్ లో గుంతలో మట్టితో లెవెల్ చేశారు. గ్రామంలోని ప్రజలు గ్రామంలో కరెంటు సమస్య లేకుండా సర్పంచ్ తగిన చర్యలు తీసుకోవాలని కోరుకున్నారు.

# వరంగల్ భద్రకాళి అమ్మవారి సన్నిధిలో ధ్వజ స్తంభ ప్రతిష్టాపన

**వరంగల్ సిటీ బ్యూరో న్యూస్ ఇండియా ప్రతినిధి. (రవీందర్)**దక్షిణ భారత దేశంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో స్వయంవ్యక్తమైన శ్రీ భద్రకాళీ దేవస్థానం దక్షిణాచార శాక్త్యాద్వైత సంప్రదాయ పద్ధతిలో వైదికాగమానికి అధారిటీగా చెప్పుకుంటారు. మనుష్య జన్మకు ప్రధానమైనది తాను తరిస్తూ పరులను తరింపజేయాలి, ఇందుకు దైవానుగ్రహం కావాలి. ఆత్మోద్ధరణకు అంటే తనను తాను ఉద్ధరించుకోవడానికి ఇంట్లో దేవతార్చన చేయాలి దానిని ఆత్మర్థపూజ అంటారు. ఆత్మార్థ స్థానం తన ఇల్లు. ఆ తరువాత తనతో పాటు ఈ లోకమంతా క్షేమంగా ఉండాలి అని భగవంతుడిని ప్రార్థించాలి. దానికి స్థానం దేవాలయం. ఆలయంలో చేసే పూజను పరార్థ పూజ అంటారు. మనిషికి రెండు ప్రధానమైనవే అవి ఒకటి ఆత్మార్థ పూజ, రెండవది పరార్థపూజ. ఈ పూజలు ఎలా చేయాలి అని చెప్పేవి ఆగమశాస్త్రాలు. ఈ ఆగమ శాస్త్రాలు జ్ఞానయోగక్రియాచర్య పాదాలు అని నాలుగు పాదాలుగా ఉంటాయి. పరార్థ పూజకు స్థానమైన ఈ ఆలయ నిర్మాణం ఎలా ఉండాలి అని చెప్పేది ఆగమ శిల్పశాస్త్రములు. ఈ ఆలయ నిర్మాణం అనేది మూడు దశలుగా ఉంటుంది. కర్షణాది ప్రతిష్టాంతం, ప్రతిష్ఠాది ఉత్సవాంతం, ఉత్సవాది ప్రాయశ్చిత్తాంతం. భూమిని త్రవ్వి ఆలయం నిర్మాణం పూర్తి చేసి మూర్తి ప్రతిష్ఠ చేయడం మొదటి దశ. కొన్ని స్వయం వ్యక్తమైన మూర్తులుంటాయి. వాటికి ఆగమ శిల్పశాస్త్రం ప్రకారం దేవాలయం కడతారు. వాటిని స్వయంభూ దేవాలయాలుగా పేర్కొంటారు. ప్రతిష్ఠ అయినది మొదలుకొని ఉత్సవాంతం రెండవ దశ. అంటే నిత్యాహ్నికం (నిత్య ధూప, దీప, నైవేద్యాలు) తో పాటు నిత్యోత్సవ పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాదులు జరుపడం ప్రతిష్ఠాది ఉత్సవాంతం అని అంటారు. ఇది రెండవ దశ. ఈ సందర్భంలో ఏడు రోజులకు పైబడి చేసే ఏ ఉత్సవానికైనా ముందుగా ధ్వజారోహణం జరుపాలి. ఈ ధ్వజారోహణం ధ్వజస్తంభం పైనే జరుపుతారు. ఏడు రోజుల కంటే తక్కువగా జరిపబడే ఉత్సవాలకు ధ్వజారోహణం అవసరం ఉండదు. కానీ ఆ ఉత్సవాలు జరుపబడాలన్నా శాశ్వత ధ్వజస్తంభం మాత్రం తప్పనిసరిగా ఉండాలి. ఈ ధ్వజస్తంభ దర్శనం కూడా భక్తులకు బహుముఖ ప్రయోజనాలు కల్పిస్తుంది. ఈ ధ్వజస్తంభంలో మూడు ప్రధానమైన భాగాలు ఉంటాయి. భూమిలో ఉండే భాగం చతురస్రంగా ఉంటుంది. దీన్ని బ్రహ్మభాగం అంటారు. పీఠంలో ఉండే భాగం ఎనిమిది భాగములుగా ఉంటుంది. ఇది విష్ణు భాగం. ఆ పైన ఉండే భాగం గుండ్రగా ఉంటుంది. అది రుద్రభాగంగా చెపుతారు. అంటే ఈ ధ్వజస్తంభం త్రిమూర్త్యాత్మమైనది. ఈ ధ్వజస్తంభాన్ని భూమిలో కూర్మశిలపై ఆధార పీఠాన్ని ఉంచి భూమిలో కూర్మశిల ప్రతిష్ఠ చేసి దానిపై గల ఆధార పీఠంలో నిలబెడతారు. ఈ కూర్మశిల భక్తులకు తెలిసీ తెలియక అశుచి కలిగివున్న భక్తులు ఆలయంలో ప్రవేశిస్తే అట్టి భక్తుల వల్ల ఆలయం అపవిత్రం కాకుండా పవిత్రంగా ఉంచేది ఈ కూర్మ శిల, తద్వారా ఆలయం ఎప్పుడు పవిత్రంగా ఉంటుంది. ధ్వజస్తంభానికి మేఖలాలు ఉంటాయి. ఆ మేఖలాలకు చిరుఘంటలు ఉంటాయి. ఆ ఘంటల సవ్వడికి అసురీ శక్తులు ఆ ప్రాంతాన్ని విడిచి దూరంగా వెళ్ళిపోతాయి. అంతేకాకుండా ఆ సవ్వడి భక్తులను పునీతులను చేస్తుంది. ఇత్యాది అనేకమైన ప్రయోజనాలను ఆలయ సందర్శన సందర్భంలో ధ్వజస్తంభం భక్తులకు అనేక విధములైన దైవికమైన ప్రయోజనాలను కలిగిస్తుంది. ఈ ధ్వజస్తంభం.
ప్రస్తుతమున్న ధ్వజస్తంభం శిథిలం కావడం వల్ల ఆ శిథిలమైన ధ్వజస్తంభాన్ని తొలగించి శాశ్వత ధ్వజస్తంభం ఆలయ ధర్మకర్తలు భద్రాచలం అడవుల నుండి నాణ్యమైన ధృడమైన స్తంభాన్ని ఖరీదు చేసి ఆలయానికి తీసుకువచ్చారు. సుమారు దాదాపు ఏడు లక్షల రూపాయల వరకు ఈ స్తంభం గుడికి రావడానికి వెచ్చించడం జరిగినది. ఈ ఖర్చంతా ఆలయ ధర్మకర్త శ్రీ జారతి వెంకటేశ్వర్లు వారి బంధువులు శ్రీ గోపాల నవీన్ రాజ్ సోదరులు భరించారు. ఈ ధ్వజస్తంభానికి ముందు భలిపీఠం దాని ముందు అమ్మవారి వాహనం ఉంటుంది. ఇదే వాహన చిహ్నం పంచలోహాలతో చేసినది ధ్వజస్తంభ శిఖరాగ్రంలో ఉంటుంది. లేదా దానికి ప్రత్యామ్నాయంగా ఒక కలశాన్ని ఉంచుతారు. ఈ ధ్వజస్తంభ ప్రతిష్ఠ 2026వ సంవత్సరం జూన్ 17వ తారీకు ఉదయం గం॥ 08-36ని॥లకు కర్కాటక లగ్నంలో శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధీశ్వరులు శ్రీ శ్రీ అభినవోదన్ద విద్యాశంకర భారతీ స్వామివారి కరకమలములచే జరుపబడుచున్నది. తెలంగాణా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు గౌ॥ శ్రీమతి కొండా సురేఖ , వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసనసభ్యులు లిగౌ॥ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి లి అనేక మంది ప్రముఖులు వేలాదిగా ఆలయానికి విచ్చేసే భక్తుల సమక్షమున ఈ క్రతువు నిర్వహింపబడుతోంది. ప్రతిష్టా సందర్భంలో ఈ ధ్వజస్తంభాన్ని లేపుతున్నపుడు దర్శించడం జీవుడు జన్మజన్మాంతర ప్రాప్తమైన పాపముల నుండి విముక్తుడై శాశ్వతమైన పుణ్యప్రాప్తిని పొందుతాడని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ సందర్భంగా పల్లెటూర్లలో, పట్టణాలలో మరియు మహానగరాలలో ఆలయాలలో జరుపబడే ధ్వజస్తంభ ప్రతిష్ఠ దర్శించడానికి దేశదేశాల నుండి ప్రజలు తమతమ గ్రామాలకు తిరిగి వస్తారు. అత్తవారింట్లో ఉన్న తమతమ ఆడపడచులను పిలిపించుకొని కొత్త భూషణాదులతో సత్కరిస్తారు. ఈ సందర్భంగా ముక్కోటి దేవతలు ఆ దేవాలయానికి చేరతారు. ఇట్లా అనేకమైన పుణ్యప్రాప్తి కలిగించేది ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ. ఈ కార్యక్రమాన్ని మూడు రోజులు జరుపుతారు. ఈ కార్యక్రమానికి రెండు రోజుల ముందుగా ప్రతిష్ఠాయాగాన్ని ఈ నెల 15 తేది సోమవారం రోజున ప్రారంభిస్తున్నారు. ఆనాడు జలాదివానం, ఆ మరునటి రోజు ధాన్యాదివాసం, ఫలపుష్పపంచశయ్యాది వానములు జరుపుతారు. వేదఘోషలతో, నామసంకీర్తనములతో ఆగమోక్తక్రియాకలాపములతో జరుపబడే ఈ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మానవ జీవితంలో ఒక మరుపురాని పవిత్రమైన మహదానందాన్ని ప్రజలకు కలిగిస్తుంది.
కావున భక్తులు యావన్మంది ఈ కార్యక్రమంలో పాల్గొని యదోచితంగా పాల్గొని అణ్వయించ ప్రార్థన.

## వేణు మృతుదేహానికి నివాళులర్పించిన:మాజీ ఎమ్మెల్యే పెద్ది



**న్యూస్ ఇండియా :దుగ్గొండి :**వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం రేకంపల్లి గ్రామంలో బి ఆర్ ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నీరట మురళి తమ్ముడు నీరటి వేణు జూన్ 11 గురువారం రోజున రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శుక్రవారం సాయంకాలం మరణించడం జరిగినది, విషయం తెలుసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి వారి వేణు పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు.మృతుడి కుటుంబానికి మేమున్నామని ధైర్యం భరోసా ఇవ్వడం జరిగినది,
ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుకినే రాజేశ్వరరావు,మాజీ మార్కెట్ చైర్మన్ పొన్నం మొగిలి,మాజీ ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య , యూత్ కన్వీనర్ శాన బోయిన రాజ్ కుమార్,మాజీ సర్పంచ్ ఇమ్మడి యుగేందర్,ఉప సర్పంచ్ పొన్నం వంశీ,వార్డ్ మెంబర్ ఇజ్జగిరి రాజన్న ,తౌటు విజయ రవి, ఇసంపల్లి సులోచన సుమన్, ఇజ్జగిరి రంజిత్,ఈసంపల్లి రాజు, గ్రామ పార్టీ యూత్ అధ్యక్షులు జన్ను మనోజ్,సీనియర్ కార్యకర్తలు రాజకుమార్,భాస్కర్, తిరుపతి,శానబోయిన నరసింహ స్వామి,యూత్ సభ్యులు యాట నరేష్, మహేందర్ ,నరేష్, తదితరులు పాల్గొన్నారు,

## బాసర త్రిపుల్ ఐటీకి కుసంగి ఒక స్కూల్ నుండే ముగ్గురు విద్యార్థుల ఎంపిక

- ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం
- ప్రధానోపాధ్యాయురాలు బి ప్రసన్న వదన




**న్యూస్ ఇండియా (టేక్మాల్ రిపోర్టర్ జైపాల్ జూన్ 13)** మెదక్ జిల్లా టేక్మాల్ మండలం పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుసంగి నుండి పి.నిఖిల్, హీన, బి.లావణ్య ముగ్గురు విద్యార్థులు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బాసరలో ప్రవేశాలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి ప్రసన్న వదన తెలిపారు. మారుమూల ప్రాంతం నుండి ట్రిబుల్ ఐటీ కి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎంపికకు ప్రధానోపాధ్యాయురాలు మరియు ఉపాధ్యాయ బృందం చేసిన నిరంతర కృషి, ప్రణాళిక బద్ధమైన బోధన, ప్రత్యేక తరగతుల నిర్వహణ, పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయం అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా రాష్ట్రస్థాయి విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం పాఠశాల ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు,విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు , ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు తెలిపారు.

## చెక్‌పవర్ రద్దు ఆలోచన ఉపసంహరించుకోవాలి.

- ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి.



**న్యూస్ ఇండియా తెలుగు జూన్ 13. మహబూబాబాద్ జిల్లా బయ్యారం....** ఉపసర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని జగ్గుతండ ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో వీరస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపసర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేయాలని చూస్తున్నదని,వెంటనే ఆ ఆలోచనను విరమించుకోవాలని కోరారు.లేనిపక్షంలో మండల ఉపసర్పంచ్ ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చెపడతామని పేర్కొన్నారు.అదేవిధంగా ఉపసర్పంచ్ ల సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తామని,ప్రభుత్వం దిగివచ్చే వరకూ ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com